క్లుప్తంగా

నేడు 'వలంటీర్లకు వందనం'

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలు అందించేందుకు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేస్తామని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారన్నారు.

ఉద్యోగుల సంఘ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ డైరీని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు, జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి భరత్‌రాజు, మహిళా విభాగం కార్యదర్శి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలసిన మొహమ్మద్ ఆరిఫ్



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆరిఫ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మొహమ్మద్ ఆరిఫ్‌కు సూచించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్ బాషాలు సజ్జలను కలసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీలను చైతన్యపరిచి వైఎస్సార్ సీపీకి అండగా నిలిచేందుకు సమష్టిగా కృషి చేస్తామని వారన్నారు.

జీవన నైపుణ్యాలపై శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని జయించి, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యాలు ఏర్పరచుకునే దిశగా జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆ వివరాలను ఇంటర్ బోర్డు ఆర్జేడీ ఐ.శారద తెలిపారు. రాజమహేంద్రవరంలోని నారాయణ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో 120 మందికి శిక్షణ ఇచ్చారు. పరీక్షలు జయించడం, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యాలపై కళాశాల కౌన్సిలర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. వీరు ఆయా కళాశాలల్లో విద్యార్థులకు ఆ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటర్ బోర్డు ఆర్ఐఓ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, డీవీఈఓ జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, డీఈసీ మెంబర్లు ఎస్.సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శారద

ప్రకాశంనగర్: జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మోతా శారద నియమితులయ్యారు. బుధవారం స్థానిక కోర్లమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పూర్వ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఏఐసీసీ సభ్యురాలు అమర్ జా బేగ్, మార్టిన్ లూథర్‌లు శారదకు నియామకపత్రం అందజేశారు. అమర్ జా బేగ్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అన్యాయాలను అరికట్టేందుకు శారద నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలని కోరారు. నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి జేష్ఠ సతీష్‌బాబు, కిసాన్ సెల్ నాయకుడు కాకర్ల హరిబాబు, నలబాటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేస్తా...

రాజమహేంద్రవరం సిటీ: 2024 ఎన్నికల్లో అమలాపురం నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రకటించారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియాలో అమలాపురంలో తన కోసం చేసిన సర్వేలో 79 శాతం అనుకూలంగా వచ్చిందన్నారు.

అభివృద్ధికి జేగురుపాడు

- గ్రామంపై వైఎస్సార్ ముద్ర
- నాడు తండ్రి.. నేడు తనయుడు
- రూ.కోట్లతో ప్రగతి

కడియం: ఆ గ్రామంలో ప్రగతి పరుగులు తీసింది.. అభివృద్ధిలో చెరగని ముద్ర వేసింది.. అన్నింటా దూసుకుపోయింది.. కడియం మండలం జేగురుపాడు గ్రామ పంచాయతీ అభివృద్ధికి చిరునామాగా మారింది. ఇప్పటికే అనేక సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డులు సాధించింది. అప్పట్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ గ్రామానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయించగా, అదే బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనదైన ముద్ర వేశారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నేరుగా రూ. కోట్లకు పైగా పనులు చేశారు. ఇందులో ప్రధానంగా రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ తదితర ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, పార్కులు, కన్వెన్షన్ హాళ్లు, సీసీ డ్రైన్లు తదితర పనులు ఉన్నాయి. తాజాగా రూ. 21 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. ఇప్పుడు అన్ని వర్గాల అవసరాల కోసం ప్రభుత్వ రూ.40 లక్షలతో జేజీపీ కన్వెన్షన్ హాలును సర్వాంగా సుందరంగా నిర్మించారు. ఇది గురువారం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్యులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు హాజరుకానున్నారు.



జేగురుపాడులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన జేజీపీ కన్వెన్షన్ హాలు

అన్నింటా ప్రగతి సొంతం

జేగురుపాడు గ్రామంపై వైఎస్సార్ కుటుంబ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అప్పటి మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుల కృషితో రాష్ట్ర వ్యాప్తంగా పేరొందే విధంగా అభివృద్ధి పనులు జరిగాయి. కాకినాడ కాలువపై వంతెన, సమావేశ మందిరాలు, పలు ప్రధాన రోడ్లు తదితర అభివృద్ధి పనులతో ఆ నాడు కూడా జేగురుపాడు కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధికి నోచుకుంది. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా స్పష్టమైన ప్రగతిని సొంతం చేసుకుంది. సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులు జరిగాయి. ఇంకా పలు పనులు పూర్తయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా వైఎస్సార్, జగన్ హయాంలలో భార్యాభర్తలు దేవదీవెనకుమారి, యాదల సతీష్‌చంద్రస్టాలిన్‌లు సర్పంచ్‌లుగా సేవలందించడం గమనార్హం.

30 పోలీస్ యాక్ట్ అమలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సౌత్ జోన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ అంబికాప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకూ ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఇది రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధికి వర్తిస్తుందన్నారు. దీని ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదన్నారు. అటువంటివి నిర్వహిస్తే తమ వద్ద ముందుగా అనుమతి పొందాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. జిల్లా ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా, ప్రశాంత జీవనానికి ఆటంకం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలను కాపాడాలని సౌత్ జోన్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఏవీఏ రోడ్డులోని సీఎస్ఎన్ చర్చిలో ఏర్పాటు చేసిన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్ చెయ్యగలిగితేనే చెప్తాడని, చెప్పాడంటే చేస్తాడనే విధంగా దేశ రాజకీయాల్లోనే తనదైన పాలన కనబరుస్తున్నారన్నారు. అర్హుల ఖాతాలకు నేరుగా పథకాల ప్రయోజనాలను అందించే విధంగా నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.2.53 లక్షల కోట్లను అందించారన్నారు. ఇందులో 74 శాతం సుమారు రూ.2 లక్షల వరకూ మైనారిటీలు, బీసీల సంక్షేమానికి అందజేశారన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాన్ని అందించడం సంతోషాన్ని ఇచ్చిందని, ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను జెడ్పీటీసీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేశానని, ప్రస్తుతం రామచంద్రపురం ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ, సేవకునిగా ప్రజలకు సేవ చేస్తానని మంత్రి తెలిపారు. తనను రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా సీఎం జగన్ నియమించారని, పాలకునిగా కాకుండా ఒక సేవకునిగా రూరల్ నియోజకవర్గ ప్రజలందరికీ చేదోడుగా ఉంటానని చెప్పారు. రూరల్ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం, అందరినీ కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణను ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, క్రిస్టియన్ మైనారిటీ కోర్ కమిటీ మెంబర్ బిషప్ ప్రతాప్‌సిన్హా, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ బ్రదర్ జాన్సన్ మేడిది, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కోశాధికారి టాటావిక్టర్, అడిషనల్ సెక్రటరీ ఎం.విజయసారథి తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో వీఎస్‌సీ ప్రసాద్, డాక్టర్ కె.మోజెస్‌బాబు, వై.ఏలియా, పి.నరేష్, పి.డానియేలు, స్వరూప్, సోనివుడ్, పి.ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

వన్ స్టాప్ సెంటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కలెక్టర్ మాధవీలత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం రూరల్: వన్ స్టాప్ సెంటర్‌లో ఎనిమిది కేటగిరీలలో 13 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వన్ స్టాప్ సెంటర్ కమిటీ సభ్యులతో కలసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులను కలెక్టర్ మాధవీలత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, ఇతర అధికారులు ఇంటర్వ్యూ చేశారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న వన్ స్టాప్ సెంటర్, రాజమహేంద్రవరం వద్ద కాంట్రాక్టు / ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేయడానికి స్థానికంగా ఉండే అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ ఒక పోస్ట్, కేస్ వర్కర్ రెండు పోస్టులు, పారా లీగల్ పర్సనల్/ లాయర్ ఒక పోస్ట్, పారా మెడికల్ పర్సనల్ ఒక పోస్ట్, సైకో-సోషల్ కౌన్సిలర్ ఒక పోస్ట్, కంప్యూటర్ పరిజ్ఞానంతో ఆఫీస్ అసిస్టెంట్ ఒక పోస్ట్, మల్టీ-పర్పస్ స్టాఫ్/ కుక్ మూడు పోస్టులు, సెక్యూరిటీ గార్డ్ / నైట్ గార్డ్ మూడు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 116 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 88 మంది అభ్యర్థులు అర్హత సాధించారని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి వెల్లడించారు. వీరిలో 87 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. దిశా డీఎస్పీ బి.ఆదినారాయణ, జిల్లా బార్ అసోసియేషన్ చైర్మన్ జీయూవీబీ రాజు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, డీపీఓ డి.రాంబాబు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జె.అన్నపూర్ణ, విజయ దీపిక పాల్గొన్నారు.

నూరుశాతం పోలియో చుక్కలు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్

కడియం: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలో నూరు శాతం ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ ఆదేశించారు. పల్స్ పోలియో సన్నాహక సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. మండలంలోని 35 బూత్‌లు, ఒక మొబైల్ టీం, ఒక ట్రాన్సిట్ బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్క చిన్నారికి పోలియో నివారణ మందును అందించేందుకు కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. వైద్యులు ఎస్.జెస్సీసుప్రియ, ఎస్.నాగసాయిమౌర్య, వైద్య సిబ్బంది ఎం.రామకృష్ణ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ 23 శాతం వర్తింపుపై హర్షం

మధురపూడి: సమగ్ర శిక్ష అభియాన్‌లో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం గత పీఆర్సీ 23 శాతాన్ని వర్తింపజేసినందుకు ఆ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జాకబ్‌రాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

ప్రకాశంనగర్: స్థానిక కళాగౌతమి, సంహిత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ప్రముఖ ఆంత్రోపాలజిస్ట్ సన్నాడి వెంకట రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మ భాష గొప్పదనం ఎంతో మధుమైందని తెలిపారు. డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో ఉన్న పదజాలం, మరి ఏ భాషలోనూ ఉందన్నారు. మన భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.రామకృష్ణ, పీవీబీ సంజీవరావు, రమాదేవి, సంగీత విద్వాంసుడు విశాల్, బలరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

కడియం: దుళ్లలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సుదర్శన హోమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుడు ఖండవిల్లి రవి ఆధ్వర్యంలో రుత్వికులు హోమాన్ని జరిపించారు. యజ్ఞ యాగాదులు, హోమాల నిర్వహణ ద్వారా లోక కల్యాణంతో పాటు, సమస్త జీవాల మనుగడకు ఆస్కారం ఉంటుందన్నారు. హోమ ప్రక్రియ ప్రతిఘట్టానికి సంబంధించిన వేద ప్రమాణికతలతో రవి ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. అలాగే సాయంత్రం ఆరు గంటలకు సహస్ర దీపాలంకరణ జరిగింది. రాత్రి సింహ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట భజన బృందాలు, మేళతాళాల నడుమ వేలాది మంది భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు అన్నకూటోత్సవం, సాయంత్రం సదస్యం, సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి హనుమంత వాహన సేవ ఉంటాయని ఆలయ భక్త బృందం తెలిపింది.

కారును ఢీకొన్న లారీ

స్తంభించిన ట్రాఫిక్



బొమ్మూరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం కారును లారీ ఢీకొనడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. స్థానికుల కథనం ప్రకారం.. వేమగిరి వైపు నుంచి బొమ్మూరు వస్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో బొమ్మూరు జాతీయ రహదారిపై సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయం కావడంతో స్కూల్ బస్సులు, ఆటోలతో పాటు, లారీలు ఇతర వాహనాలు ఆగిపోయాయి. సంఘటన స్థలానికి బొమ్మూరు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కలసి స్థానికులు సైతం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విభజన హామీలు అమలు చేయాలి



రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న చలసాని శ్రీనివాస్ తదితరులు

ప్రకాశంనగర్: ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నారు. దీనికి బుధవారం ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి పార్టీలకు అతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కృష్ణ చైతన్య, పొన్నల దినకర్‌లకు చలసాని సంఘీభావం తెలిపారు. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విభజన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, బి.రాజులోవ తదితరులు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.

కన్నుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠాపన



సీతానగరం సీతారామాలయం వద్ద ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: సీతానగరంలో పునర్నిర్మించిన రామాలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమత్, లక్ష్మణ, సీతా సమేత శ్రీరామచంద్రమూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపనల మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. కగనర్ల వెంకప్ప శ్రేష్ఠ, అన్నపూర్ణ, కుసుమంచి వీర్రాజు, మహాలక్ష్మి కస్తూరి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముందుగా ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ఆరాధ్యుల రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు ఆలయాలను తి.తి.దే శ్రీవారి శ్రీవాణి ట్రస్ట్ సౌజన్యంతో అభివృద్ధి చేస్తున్నామని, ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. సీతానగరంలో రామాలయాన్ని రూ.60 లక్షల సీజీఎఫ్ గ్రాంటులతో అభివృద్ధి చేశామన్నారు. కోరుకొండ మండలం గరగంపాలెం, రాజానగరం మండలం సంపత్ నగరంలలో సీతారాముల ఆలయాల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కేటాయించామన్నారు. నియోజకవర్గంలో సుమారు 117 ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. 144 అడుగుల ఎత్తయిన శ్రీఆంజనేయస్వామి వారి విగ్రహంతో పాటు కోరుకొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి చర్యలు చేపట్టామని విజయలక్ష్మి వివరించారు. గరగపాలెం, సంపత్‌నగర్‌లలోని రామాలయాలను సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద జక్కంపూడి విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. సీతానగరంలో జరిగిన అన్నసమారాధనలో ఐదు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఆర్యవైశ్యులు కనగర్ల రమణ గుప్త పాల్గొన్నారు.

డ్రైనేజీ తవ్వారు.. మట్టి వదిలేశారు



రోడ్డుపై వేసిన డ్రైనేజీ మట్టి

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో డ్రైనేజీ నిర్మించడం ద్వారా వచ్చిన మట్టిని తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడ వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. ధవళేశ్వరం పంచాయతీ పరిధి బొమ్మూరు రోడ్డులో సైన్స్ సెంటర్ నుంచి రూరల్ తహసీల్దార్ కార్యాలయం మీదుగా డ్రైనేజీ నిర్మిస్తున్నారు. ఈ డ్రైనేజీ కోసం తవ్విన మట్టిని రోడ్డుపై వదిలేశారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో వైటీసీ కాంపౌండ్‌లో 15 జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. రాత్రి సమయంలో అధికారులు, సిబ్బంది ఆ రోడ్డులో రావాలంటే కనీసం ఒక వీధిలైటు కూడా లేదు. దీనివల్ల అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ రాత్రి సమయంలో వెళుతూ పడిపోవడంతో కాలు విరిగిపోయింది. అతను ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇలా అనేకమంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ధవళేశ్వరం పంచాయతీ అధికారులు స్పందించి వీధిదీపాలు వేయడంతో పాటు, డ్రైనేజీలో తీసిన మట్టిని తీయించాలని పలువురు కోరుతున్నారు.